# పుట్టినూరు

"మా పొలాలు కాజేసేవు, మా కొంప ముంచేవు. మమ్ముల్ని దిక్కులేని పచ్చుల్ని చేసేవు. మా నోటికాడి కూడు మింగేసేవు. నువ్వేం బాగుపడతావు, ఏం తుతెల్లుతావు. నాశనమయిపోతావు" అని తిట్టిపోశాడు శివన్నారాయణ ఏభైఏళ్ళ క్రితం ఊరొదిలి ఏడుస్తూ పోతూ. నాటినుంచి నేటిదాకా, కోపం వల్ల, ఊరివైపు తొంగికూడా చూడలేదు. ఇప్పుడు కూడా ఇటువచ్చేవాడు కాదు, కూతురూ, కొడుకూ తొందరచేసి బలవంతపెట్టకపోతే.

కడుపు చేతపట్టుకొని వారం రోజులు నడచి, హైద్రాబాదు చేరుకొన్నప్పుడు శివన్నారాయణ ఇరవై ఏళ్ళ యువకుడు. ఎవరేం పని చెప్పినా చేశాడు. ఏం పెట్టినా తిన్నాడు. మూటలు మోశాడు. ముఠా పనులు చేశాడు. అప్పటికే ఉన్న కాస్తంత చదువును అటూ ఇటూ పెంచుకొని, బట్టల కొట్టులో గుమాస్తాగా చేరాడు. ఎన్ని పనులు చేసినా రిజిస్ట్రారు ఆఫీసు దగ్గర డాక్యుమెంటు రైటరుగా స్థిరపడ్డాడు. పెళ్ళి చేసుకొన్నాడు. ఇల్లు కట్టుకొన్నాడు. ఇద్దరు పిల్లల తండ్రి అయ్యాడు. ఇద్దరూ ఇల్లొదిలి వెళ్ళి, ఉద్యోగాలు చేసుకొంటూ, అమెరికాలోనే పెళ్ళిళ్ళు చేసుకొని, పిల్లల్ని కని, అక్కడి పౌరులుగా మారిపోయారు.

అమెరికా పౌరులైన ఎవరికైనా, ఏదో తరంలో ఇతర దేశ పౌరసత్వం ఉండి ఉండటం వల్ల, వాళ్ళు తమ తల్లివేరు వెతుక్కోవటానికి ఇష్టపడుతూ ఉన్నట్లుగానే, కొడుకు నాగార్జున, కూతురు నందిని తమ సొంతూరు మీద మక్కువ పెంచుకొన్నారు. నిజానికి వాళ్ళ జన్మస్థలం హైదరాబాదే అయినా, తండ్రి స్వగ్రామం చూడాలని వాళ్ళకు చాలాకాలంగా ఇష్టంగా ఉండేది. అమెరికా చేరాక, ఆ ఇష్టం మరీ ఎక్కువయింది,.

అటుఇటుగా నలభై ఏళ్ళున్న పిల్లలిద్దరూ మనూరికి పోయి వద్దామనే అంటూ ఉండేవాళ్లు. ఎప్పుడు ఎవరు ఇంటిని, సొంతూరును గూర్చి ఏమి అడిగినా శివన్నారాయణ ఏడ్చేవాడు. ఏమీ చెప్పే వాడుకాడు. వాళ్ళు మరీమరీ అడుగుతూ వస్తుంటే నాకు ఏడుపు వస్తుందనేవాడు. తండ్రిని ఏడిపించలేక వాళ్ళు ఊరుకొన్నారు.

ఇవాళ వీళ్ళు కారులో బయలుదేరే ముందు "అక్కడికి వస్తే నాకు చావాలనిపిస్తుంది" అని తండ్రి అన్నాడు. కాని వాళ్ళు వినిపించుకోలేదు. బయలుదేరారు తండ్రి, తల్లి, కొడుకు, కూతురు.

తోవపొడుగునా తండ్రి ఏడుస్తూనే ఉన్నాడు. శివన్నారాయణ సహజంగానే ధైర్యం ఉన్న మనిషి. ఎంతకష్టమైనా గుండె నిబ్బరంతో ఎదుర్కోగలిగిన మనిషి. కానీ స్వగ్రామమంటే బేలగా బెంబేలు పడిపోతున్నాడు.

ప్రయాణమంతటా తండ్రిని ఓదార్చటానికే వాళ్ళకు సరిపోయింది. శివన్నారాయణ ఆలోచనలకు అడ్డుకట్ట వేయటానికి తోవపొడుగునా ఎవరో ఒకరు ఏదో ఒకటి మాట్లాడుతూనే ఉన్నారు.

"కరువు కాటకాలు తాండవిస్తాయనే వాడివి పంటలు బాగానే పండుతున్నట్లున్నాయి కదా" అంటే "పండుతున్నాయి. ఈ మధ్యే సాగర్ నీళ్ళ వల్లే" అన్నాడు.

"నీ చిన్నతనంలో?"

"రాగి, సజ్జ, జొన్న, కొర్ర, సజ్జన్నం పెరుగులో ఎంత రుచో! మాకు నాలుగు పాడి గొడ్లు ఉండేయి; దివ్వెమైన వ్యవసాయం' 'మరి ఆ వ్యవసాయమంతా ఎవరు చేస్తున్నారు!' అంటే "నన్నడగొద్దు" అని ఏడ్చేశాడు.

తండ్రి ఊరొదిలిరావటం, తాత వృద్ధుడు కావటంతో వ్యవసాయం దెబ్బతిని ఉంటుందని వాళ్ళు భావించారు.

వాళ్ళ కారు ముందుగా మాచెర్ల చేరింది. సందు తిరిగి కాలనీలోకి వచ్చింది. కాలనీలో తమ ఇంటిని గుర్తుపట్టాడు, శివన్నారాయణ. పడిపోయి ఉంది. ముందుగా తల్లి, అవస్థలు పడి తండ్రి చనిపోయారు. శివన్నారాయణ రెండు సందర్భాలలోనూ మాచెర్ల రాలేదు. ఇటువస్తే ఆత్మహత్య చేసుకోవాలని అనిపిస్తుందనీ, అందువల్ల రాలేకపోయాననీ చెబుతూ ఉండేవాడు.

"పడిపోయిన ఇల్లు కట్టిద్దా" మన్నారు పిల్లలు.

"ఎవరుంటారు?" అన్నాడు తండ్రి.

"మనూరు బాగుంద"న్నారు వాళ్ళు. "మాచెర్ల మా సొంతూరు కా"దన్నాడు శివన్నారాయణ. "గవర్నమెంటు ఇల్లిచ్చింది. కొంత డబ్బిచ్చింది. ఆళ్ళ బతుకులట్టా తెల్లారేయి" అన్నాడు.

"మరి నువ్వు పుట్టినూరు?"

"పోదాం! నాకు గుండె ఆగినా, నాకు సద్దామనిపించినా, సచ్చినా, మీరు దిగులు పడకూడదు" అన్నాడు.

"నేనూ పెద్దోణ్ణి అయ్యేను. బాద్దెతలన్నీ తీరేయి. ఉన్నా, ఊడినా ఒకటే" అనీ అన్నాడు.

"నువ్వింత కఠినంగా మాట్లాడుతుంటే మనం మనూరు చూడనక్కరలేదు. తిరిగి వెళ్ళిపోదామని" అని వాళ్ళంటే "నేనూ పెద్దోణ్ణి అయిపోయేను గదా, నాకూ సూద్దాంవనే ఉంది. కానీ తట్టుకోలేనని బయిం, తీరా వచ్చేంగా, పోయి చూసే వద్దాం ఇంకెంత కాలం బతుకుతాను" అన్నాడు.

నాగార్జునసాగర్ డాం దగ్గరకు వచ్చి లాంచీ మాట్లాడుకొని,నలుగురు ఎక్కి కూర్చున్నారు. సాగర్‌లో లాంచీ ప్రయాణం మిగతా వాళ్ళకు సరదాగా ఉంది. శివన్నారాయణ కన్నీరు తుడుచుకొంటున్నాడు.

నలభై ఏళ్ళు వచ్చినా పిల్లలిద్దరూ పసిపిల్లలై నీళ్లతో ఆటలాడుతూ ఉత్సాహంగా ఉన్నారు. వాళ్ళకది పిక్‌నిక్ లాగా ఉంది. ఐదు సముద్రాలు దాటి అమెరికా చేరినవాళ్ళకు సాగర్ నీళ్లు సరదా పుట్టిస్తున్నాయి. కావాలంటే రోజూ సముద్రం చూడగలిగేవాళ్ళకు సాగర్ నీళ్ళు అంత సంతోషం కలిగిస్తుంటే చూస్తున్న శివన్నారాయణకు కొంతకాలం దుఃఖం దూరమయింది.

"ఇంకా ఎంత దూరమం"టే "ఇంకెంత" అని బదులుచెప్పి కళ్ళు తుడుచుకొంటున్నాడు.

"అది నందికొండ. నీ పేరు. ఇది నాగార్జునకొండ. నీ పేరు! నందిని, నాగార్జున తండ్రిని ప్రేమగా చూశారు. వాళ్ళకర్థమయింది, తండ్రికి తన స్వస్థలం చాలా ఇష్టమని.

"ఈ రెండింటి మధ్య కృష్ణానది ప్రవహించేది. ఎంత వానాకాలమైనా ఫర్లాంగు కంటే వెడల్పు ఉండేదికాదు. బవుదూకుడుగా ఉరికేది నది. ఎన్నిసార్లు! ఎంత ఈత!"

"మా ఇంట్లో మచ్చుమీద యేరుసెనక్కాయ మూటలుండేయి. ఎన్ని దిన్నా తరిగేవికావు. ఎంతగాలి... పిచ్చిగాలి, ఫేన్లు ఏం జేసును?

మా పొయ్యిపొంతలో నీళ్ళు ఎప్పుడూ యచ్చగా ఉండేయి. మా ఇంటి ముందు మెల్లా పెద్దగా ఉండేది. ఎన్ని ఆటలు! మా పొలం నేను ఎంతదూరం పరిగెత్తినా అంత దూరం మాదే! పండని పంటలేదు. గొడ్డుమేత కొదవలేదు. యేరుసెనక్కాయ, ధనియాలు, మిరపకాయలు, రాసులు రాసులు!

ఊరి మద్దెలో సెన్నకేశవసామి గుడి ఉండేది. గోపురం ఎంతెత్తు? చూడాలంటే కళ్ళు తిరిగేయి. కోతి కొమ్మచ్చి ఆడిన యేపసెట్లు సిటికేసర చెట్లు ఎంతెత్తు. దిక్కుమాలినంత ఎత్తు."

రెండు కొండల మధ్య కృష్ణానది ఇరుకుగా మారింది.

"ఈ రెండింటి మధ్య ఎంత దూరముంటుంది?" కొడుకు అడిగాడు.

"ఎంతలేదన్నా రెండు కోసులుంటుంది" అన్నాడు తండ్రి.

"ఇంకెంత దూరం?" కూతురు అడిగింది.

"ఎంతోదూరమా? దగ్గరకొచ్చేసేం" అన్నాడు శివన్నారాయణ.

"ఈ కొండ అంచున ఆపు!" అన్నాడు లాంచీ డ్రైవరుతో. ఆగింది లాంచి. "ఈ కొండకింద ఉన్న పొలాలన్నీ మనవే! ఏభై ఎకరాలు. ఈ పొలానికి బారెడు దూరంలో ఇదిగో ఇక్కడే మా ఊరు. ఈ ఊరి మధ్యలో కనిపించేదే గుడి. ఇదే గోపురం"

పిల్లలకు తల్లికి బిత్తరగా ఉంది.

"పక్కనే కృష్ణానది. ఉరుకులు పరుగులతో ఉండేది. ఇటు చింతతోపు. అటు యాపమాన్లు. అది కృష్ణ ఒడ్డు. దాటితే కొండ. ఈ ఒడ్డున మా ఊరు. బంగారం పండే పొలాలు. రైతులు జమీందార్లు. రాజులు, పుణ్యాత్ములు ఏమయ్యారో!"

పిల్లలిద్దరూ తండ్రి మాటలో గొంతులో మార్పు గమనించారు.

"ఇక్కడ సాగర్ లోతు ఎంత ఉంటుంది?" భార్య అడిగింది.

"ఎంతోనా రెండు నిలువులు!"

"ఏంది రెండు నిలువులు, నీ పాసుగూల! రెండు వందల అడుగులకు తక్కువ ఉండదు లోతు!"

శివన్నారాయణ మాట్లాడలేదు. భార్యాపిల్లలు ఆశ్చర్యంగా ఉన్నారు.

"మీ ఊరూ, పొలాలు, చూపుతానన్నావు" అన్నారు పిల్లలు.

ఏడుస్తూ "ఇదే మా ఊరు, ఇవే మా పొలాలు" అని వేలు చూపించాడు.

"సాగర్‌లో నీళ్ళు తగ్గినప్పుడు, ఎండాకాలం సెన్నారం గోపురం సాలా ఏళ్ళు కనిపించింది. ఇప్పుడు కనబడటం లేదు. కూలిపోయి ఉంటుంది!" లాంచీ డ్రైవరు చెప్పాడు.

"కూలటం ఏమిటి? ఉంటుంది. పోయి చూసి, సోవికి మొక్కి వస్తాను" అని శివన్నారాయణ నీళ్ళలోకి దూకబోయాడు.

పిల్లలు పట్టుకొన్నారు.

"చూసొస్తా!" అన్నాడు.

"వద్దులే" అన్నారు.

"చూపుతా!" అన్నాడు.

"వొద్దుద్దు" అన్నారు.

"నాకీతొచ్చు" అన్నాడు.

"అయినా వద్దు" అన్నారు.

"గొప్ప పోటగోడివి లేవయ్యా సోంవి. ఆగాగు! సత్తావా? నన్ను జయిలుకు పంపుతావా? మానుబావా ఆగు నాయినా ఆగు. పట్టుకొండి పట్టుకొండి" అని లాంచీని వెనక్కు తిప్పాడు డ్రైవరు.

'రండిరా సూద్దాం మా ఊరు. నన్నైనా సూడనీండ్రా. ఎంత కాలమయింది. మా అమ్మను, మా తల్లిని. మా ఊరును సూసి. నన్ను పోనీండ్రా!" అరుస్తూనే ఉన్నాడు.

తండ్రి ముఖం తడిగుడ్డతో తుడిచి బిస్కట్లు తినిపించి ఫ్లాస్కులో కాఫీ తాగించి, కూర్చోబెట్టారు.

"మా ఊరు పోనీండిరా" ఏడుస్తూనే ఉన్నాడు.

"మీ నాన్నది సెన్నారమా? ఇంకెక్కడి సెన్నారం? ఇంకెక్కడి బ్రెమలు?" డ్రైవరు నిట్టూర్చాడు.

క్రమంగా శివన్నారాయణ కన్నీరాగింది. లేచి వెనుదిరిగి చూచి 'మా ఊరు దాటి చాలా దూరం వచ్చేం" అన్నాడు.

లాంచీ వెళ్ళిపోతూ ఉంది. లాంచీ దిగుతూ "నేను పుట్టినూరు లేని సన్నాసినిరా!" అన్నాడు తండ్రి.

"ఎవడికన్నా, ఇట్టాంటి నొప్పి ఉంటదా, నాకుందయ్యా, నా దరిద్దరం"

"ప్రపంచమే నువ్వు పుట్టినూరు నాన్నా!" అన్నాడు కొడుకు.'ఈ భూమే! ఈ వసుధే నువ్వు పుట్టినూరు'

కారు దగ్గరకు నడుస్తూ, కరళ్ళెత్తి పడుతున్న నాగార్జునసాగర్‌కి రెండు చేతులెత్తి నమస్కరించాడు శివన్నారాయణ.

కారెక్కి "మా పొలాలు కాజేసి, మా కొంపముంచి, మమ్ముల్ని దిక్కులేని పచ్చుల్ని సేత్తే సేసేవుగాని, అయిదుకోట్ల మంది అన్నదమ్ములకు అన్నం పెడుతున్న తల్లి నువ్వు కలకాలం కళకళలాడుతూ ఉండుతల్లీ!" అన్నాడు శివన్నారాయణ.

కారు పరుగులు తీస్తూ ఉంది పంట పొలాలమధ్య రోడ్డుమీద.